సాక్షి తిరుపతి

శుక్రవారం । 9 । ఆగస్టు । 2024



పారిశ్రామిక దిక్సూచి శ్రీసిటీ

16 ఏళ్ల కిందట సత్యవేడులో ఏర్పాటైన పారిశ్రామిక వాడ శ్రీసిటీ దేశవ్యాప్తంగా కీర్తి ప్రతిష్టలు గడిస్తోంది. - 8లో



ఆకట్టుకున్న యువకుల విన్యాసాలు

నారాయణవనంలో పలువురు యువకులు శరీరానికి కొక్కేలు గుచ్చుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించారు. - 8లో



నా భార్య బతికే ఉందయ్యా..!

తన భార్య బతికే ఉందంటూ సత్యవేడు మండలానికి చెందిన ఓ వ్యక్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశాడు. - 8లో

న్యూస్‌రీల్

కూటమి మార్కు బదిలీలు



వెంకటనారాయణ
తిరుపతి డీఎస్పీ



విజయ్ శేఖర్
తిరుమల డీఎస్పీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పనిచేస్తున్న పలువురు డీఎస్పీలు, సీఐలను బదిలీచేస్తూ రాష్ట్ర డీజీపీ ద్వారక తిరుమలరావు ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటికే మూడు మార్లు వెలువడిన డీఎస్పీలు, సీఐల బదిలీల్లో పాటించిన 'కుల' ప్రామాణికాన్నే ఈ బదిలీల్లోనూ అమలు చేసినట్లు పోలీసుశాఖలో పెద్ద చర్చ నడుస్తోంది. ఎస్సీ, బీసీలతో పాటు పేర్ల చివరన రెడ్డి అని ఉంటే వాళ్లకు పోస్టింగులు ఇవ్వకుండా కూటమి పెద్దలు జాగ్రత్తగా బదిలీలను పర్యవేక్షిస్తున్నారు. ఇదే సమయంలో పేర్ల చివరన మూడు అక్షరాలున్న వాళ్లకు అగ్ర తాంబూలం ఇచ్చి అందలం ఎక్కిస్తున్నారు. ఇక బదిలీ అయిన అధికారుల వివరాలు పరిశీలిస్తే.. చిత్తూరు డీఎస్పీ ఎం.రాజగోపాల్‌రెడ్డిను పోలీసు ప్రధాన కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని సూచిస్తూ, ఆయనకు పోస్టింగ్ ఇవ్వలేదు. ఎర్రచందనం స్మగ్లింగ్ నిరోధక విభాగంలో పనిచేస్తున్న జి.చెంచుబాబును నాయుడుపేటకు, పోస్టింగ్ కోసం వేచివున్న కె.విజయ్‌శేఖర్‌ను తిరుమల శాంతిభద్రతలు, ఎస్‌ఈబీలో పనిచేస్తున్న జె.వెంకటనారాయణను తిరుపతి శాంతిభద్రతలు, తిరుపతి స్పెషల్‌బ్రాంచ్‌లో ఉన్న ఎం.వెంకటాద్రిని రేణిగుంట, రేణిగుంటలో ఉన్న భయ్య కిషోర్‌ను రాజమండ్రి దక్షిణ విభాగం, ఎర్రచందన స్మగ్లింగ్ నిరోధక విభాగంలో పనిచేస్తున్న జి.రవికుమార్‌ను పుత్తూరు, పుత్తూరులో ఉన్న వై.శ్రీనివాసరావును సీఐడీకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సీఐల బదిలీల్లో తిరుపతి ఎర్రచందనం స్మగ్లింగ్ నిరోధక విభాగంలో పనిచేస్తున్న కె.గంగాధరరావును బాపట్ల రూరల్, పల్నాడు జిల్లా పెదకూరపాడులో ఉన్న జి.మంగారావును గూడూరుకు, గుంటూరు వేకెంట్ రిజర్వు (వీఆర్)లో ఉన్న కె.శేఖర్‌బాబును గూడూరు వన్‌టౌన్, నెల్లూరు సోషల్ మీడియా సైబర్ క్రైమ్‌లో ఉన్న హెచ్ఎస్.హుస్సేన్ బాషను వాకాడు, నెల్లూరు టూటౌన్‌లో ఉన్న ఎం.బాబీను నాయుడుపేట అర్బన్, గుంటూరు వీఆర్‌లో ఉన్న ఎం.మురళీకృష్ణను సూళ్లూరుపేటకు బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ సౌత్ కోస్టల్ జోన్ ఐజీ త్రిపాఠి ఆదేశాలు జారీ చేశారు.

నేడు అంగప్రదక్షిణ టోకెన్ల ఆన్‌లైన్ కోటా విడుదల

తిరుమల: ఆగస్టు 10 వ తేదీ శనివారం రోజున తిరుమల ఆలయంలో అంగప్రదక్షిణ చేసుకునే భక్తులకు శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు 250 టోకెన్లను టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. భక్తులు ఈ విషయాన్ని గమనించి ఆన్‌లైన్‌లో అంగప్రదక్షిణ టోకెన్లను బుక్ చేసుకోవాలని కోరుతోంది.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 13 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 75,109 మంది స్వామివారిని దర్శించుకోగా 30,285 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.40 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తుంది. కేటాయించిన సమయంకన్నా ముందు వెళ్లిన భక్తులను క్యూలైన్‌లో అనుమతిస్తారని తెలుపుతున్నారు.

సీజీఎస్టీ పరిధిలో రూ.2.27 కోట్ల వసూలు



మాట్లాడుతున్న జాయింట్ కమిషనర్

తిరుపతి రూరల్: సెంట్రల్ జీఎస్టీ తిరుపతి కమిషనరేట్ పరిధిలో రెండు రోజుల్లోనే రికార్డు స్థాయిలో రూ.2.27 కోట్ల అపరాధ రుసుం వసూలు చేసినట్లు సీజీఎస్టీ జాయింట్ కమిషనర్ హరిహరన్ తెలిపారు. గురువారం తిరుపతిలోని సీజీఎస్టీ కమిషనరేట్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాయలసీమ పరిధిలో నిబంధనలను అతిక్రమించిన 50 మందికి షోకాజ్ నోటీసులను జారీ చేసినట్లు చెప్పారు. ఇందులో 23 మంది నుంచి గత రెండు రోజుల్లోనే రూ.2,27,94,981లను వసూలు చేశామన్నారు. మరో 27 మంది నుంచి రానున్న రెండు రోజుల్లో రూ.11.66 కోట్లను వసూలు చేయాల్సి ఉందన్నారు. నోటీసులు అందుకున్న సీజీఎస్టీ వినియోగదారులు స్వచ్ఛందంగా పన్నులు చెల్లించాలని, లేకుంటే జరిమానాలు తప్పవని హెచ్చరించారు.

నిర్వీర్యమైన ప్రభుత్వ స్కూళ్లకు గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాణం పోశారు. స్కూళ్లను మరింత అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో స్కూల్ కమిటీ చైర్మన్లను రాజకీయాలకు అతీతంగా ఎంపిక చేశారు. కానీ నేటి కూటమి సర్కారు మాత్రం కుటిల రాజకీయాలు చేసి వారు చెప్పిన వారినే స్కూల్ చైర్మన్లను చేసుకునేందుకు విద్యాశాఖ అధికారులపై ఒత్తిడి చేసింది. జిల్లాలో కూటమి ప్రభుత్వ పెద్దల ఒత్తిళ్ల మేరకు ఎస్ఎంసీ ఎన్నికలను ఏకపక్షంగా నిర్వహించారు. అధికార బలాన్ని చూపించి ఇష్టానుసారంగా వ్యవహరించారు. పలుచోట్ల ఇదేమిటని ప్రశ్నించిన తల్లిదండ్రులకు విద్యాశాఖ అధికారులు సమాధానం ఇవ్వకుండా దాటవేశారు. అన్ని నియోజకవర్గాల్లో కూటమి ప్రభుత్వానికి అనుకూలమైన వారిని ముందస్తుగా ఎంపిక చేసుకున్నారు. వారి పేర్ల జాబితాను విద్యాశాఖ అధికారులకు ఇవ్వగా గురువారం ఏకపక్షంగా వారినే ఎన్నుకున్నారు.



తొండవాడ జెడ్పీ పాఠశాల వద్ద సింగిల్ విండో మాజీ చైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డిపై దాడికి యత్నిస్తున్న టీడీపీ నాయకులు

అడ్డదారిలో అడ్డగోలుగా.. బడిలో పచ్చ గద్దలు

- జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ స్కూళ్లలో రసాభాసగా ఎస్ఎంసీ ఎన్నికలు
- రాజకీయాలకు అడ్డాగా మార్చేసిన కూటమి నేతలు
- చైర్మన్ల ఎంపికల్లోనూ కుట్రలు
- తాము చెప్పిన వారినే గెలిపించాలని విద్యాశాఖ అధికారులపై ఒత్తిడి
- 49 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు రద్దు
- గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు నిర్వీర్యమైన సర్కారు విద్యావ్యవస్థ
- గత ఐదేళ్లలో విద్యారంగానికే వన్నె తెచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- మళ్లీ ఇప్పుడు రాజకీయాలకు వాడుకుంటున్న అధికార పార్టీ

చిత్తూరు కలెక్టరేట్/తిరుపతి ఎడ్యుకేషన్: రాష్ట్రంలోని కూటమి సర్కారు ప్రభుత్వ స్కూళ్ల అభివృద్ధి కోసం ఏమీ చేయలేదనేది నగ్నసత్యం. కానీ సీఎం చంద్రబాబు గతంలో, ప్రస్తుతం తన కుట్ర రాజకీయాలను అన్నిటా చేసినట్లే స్కూల్ కమిటీ చైర్మన్లలో కూడా చేశారు. ప్రభుత్వ స్కూళ్లలో నిర్వహించే స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలకు రాజకీయ రంగు పులిమారు. గురువారం తిరుపతి జిల్లాలో నిర్వహించిన ఎస్ఎంసీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులకు తల్లిదండ్రులు ఓట్లు వేశారు. అయితే వైఎస్సార్‌సీపీ మద్దతుదారులను గెలవనివ్వకూడదనే ఆలోచనతో కూటమి ఎమ్మెల్యేలు విద్యాశాఖ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి ఏకపక్షంగా ఎన్నికలు నిర్వహించారు.

రోజంతా ఉత్కంఠ..

జిల్లాల్లో గురువారం ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించడంతో రోజంతా ఉత్కంఠ నెలకొంది. ఉదయం 7 గంటల నుంచే స్కూళ్ల వద్ద సందడి కనిపించింది. ఎన్నికల్లో పోటీ చేసేందుకు చాలామంది తల్లిదండ్రులు ఎంతో ఆశతో వచ్చారు. అయితే పలుచోట్ల ఎమ్మెల్యేల జోక్యంతో ముందుగానే పేర్ల జాబితా సిద్ధం కావడంతో ఆశావహులకు పోటీకి అవకాశం కల్పించలేదు. ఏకపక్షంగా చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకున్నట్లు హెచ్ఎంలు ప్రకటించేసి చేతులు దులుపుకున్నారు. దీంతో తల్లిదండ్రులు విమర్శలు గుప్పిస్తున్నారు.

సీక్రెట్ కవర్‌లో ముందుగానే పేర్లు..

ఎస్ఎంసీ ఎన్నికలను నిబంధనల ప్రకారమే నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. అయితే జిల్లాలో క్షేత్రస్థాయిలో మాత్రం ఎన్నికలను నిబంధనలకు వ్యతిరేకంగానే నిర్వహించారు. ముందస్తుగానే కూటమి ఎమ్మెల్యేలు తమకు అనుకూలమైన అభ్యర్థుల పేర్లను సీక్రెట్ కవర్లలో విద్యాశాఖ అధికారులకు పంపినట్లు విశ్వసనీయ సమాచారం. ఆ పేర్లనే హెచ్ఎంలు ప్రకటించి రిజిస్టర్లలో సంతకాలు చేయించుకుని, వారి చేత ప్రతిజ్ఞ చేయించి పంపేశారు.

చెప్పినట్లు చేయకపోతే బెదిరింపులు..

జిల్లాల్లో ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణ తీరు ఇటు విద్యాశాఖ అధికారులకు, అటు పాఠశాలల హెడ్‌మాస్టర్లకు తలనొప్పిగా మారింది. చెప్పినట్లు చేయకపోతే సస్పెండ్ చేయిస్తామని అధికార పార్టీకి చెందిన వారు బెదిరించారని పలువురు హెడ్‌మాస్టర్లు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయాన్ని విద్యాశాఖ అధికారుల దృష్టికి హెచ్ఎంలు తీసుకెళ్లగా వారు కూడా చేతులెత్తేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఎన్నికలు జరుగుతున్నాయని తెలిసినా విద్యాశాఖ అధికారులు ఏమీ తెలియనట్టు మిన్నకుండిపోయారు.

తిరుపతి జిల్లా వివరాలు

ఎన్నికలు జరిగిన ప్రాథమిక పాఠశాలలు 1846	ప్రాథమికోన్నత పాఠశాలలు 186
ఉన్నత పాఠశాలలు 322	ఏకపక్షంగా జరిగిన ప్రాథమిక స్కూళు 1583
ఏకపక్షంగా జరిగిన ప్రాథమికోన్నత స్కూళ్లు 145	ఏకపక్షంగా జరిగిన ఉన్నత పాఠశాలలు 230
ఓటింగ్‌లో పాల్గొన్నవి 347	ఎన్నికలు పూర్తయినవి 2305
ఎన్నికలు వాయిదా పడినవి 49	

ఎమ్మెల్యే ఒత్తిడితో ఎన్నికల నిలిపివేత

వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సుబ్బులక్ష్మి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో మెజారిటీ భాగం వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఎన్నికయ్యారు. వీరితో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని పూర్తి చేశారు. అయితే తెలుగుదేశం పార్టీ మద్దతుదారులు స్థానిక ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌ను ఆశ్రయించారు. ఆ ఎమ్మెల్యే హెచ్ఎంపై ఒత్తిడి తీసుకురావడంతో ఈ ఎన్నికలను పక్కనబెట్టారు.

పలుచోట్ల బాయ్‌కాట్..

అలాగే చిల్లకూరు మండలం ఓడూరు ప్రాథమికోన్నత పాఠశాలలో తల్లిదండ్రులు ఎన్నికలను బాయ్‌కాట్ చేశారు. దీంతో ఆ పాఠశాల హెచ్ఎం శ్రీధర్ ఎన్నికలను వాయిదా వేశారు. అలాగే పాలిచెర్లవారిపాళెం జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన ఎన్నికల్లో 12 మంది వైఎస్సార్‌సీపీ ఎస్ఎంసీ సభ్యులు ఎన్నికయ్యారు. టీడీపీ మద్దతుదారులు తిరిగి ఎన్నికలను నిర్వహించాలని పట్టుపట్టడంతో హెచ్ఎం సుధాకర్ ఎన్నికలను వాయిదా వేశారు.

- తిరుపతి జిల్లా వెంకటగిరి నియోజకవర్గంలోని సైదాపురం జెడ్పీహైస్కూల్లో ఫోరం లేకపోవడంతో ఎన్నికలు వాయిదా పడ్డాయి.
- తడ మండలం వాటంబేడు కుప్పం ప్రాథమిక పాఠశాల కమిటీ చైర్మన్ ఎన్నిక వైఎస్సార్‌సీపీ నాయకులు, టీడీపీ నాయకుల మధ్య ఘర్షణ కారణంగా వాయిదా పడింది.

అధికార పార్టీ మాది.. పెత్తనం మాది!

తొండవాడలో టీడీపీ నాయకులు వీరంగం

చంద్రగిరి : తొండవాడ జెడ్పీ పాఠశాల విద్యా కమిటీ ఎన్నికల సందర్భంగా టీడీపీ నాయకులు వీరంగం చేశారు. టీడీపీ నాయకుల ఒత్తిడితో సర్పంచ్, వైఎస్ ఎంపీపీ రాకముందే ఎన్నికలను నిర్వహించేందుకు హెచ్ఎం సిద్ధమయ్యారు. దీంతో వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సింగల్ విండో చైర్మన్ మల్లం చంద్రమౌళి రెడ్డి అభ్యంతరం వ్యక్తంచేశారు. కనీసం ప్రజాప్రతినిధులకు విలువ ఇవ్వకుండా ఎన్నికలను నిర్వహించడంపై ఆయన వీడియో చిత్రీకరించి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న టీడీపీ నాయకులు మోహన్‌రెడ్డి, మణియాదవ్, మల్లికార్జున, ఉమాపతి రెడ్డి దుర్భాషలాడుతూ మల్లం చంద్రమౌళిరెడ్డిపై దాడికి దిగారు. తొడలు కొడుతూ.. మీసాలు మెలేస్తూ టీడీపీ నాయకులు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. ''మా పార్టీ అధికారంలోకి వచ్చింది. పెత్తనం మాది. నువ్వేంటరా ఇక్కడకు వచ్చి మాట్లాడేది.. నీ అంతు చూస్తాం'' అంటూ టీడీపీ నాయకులు చంద్రమౌళిరెడ్డిని తీవ్రంగా హెచ్చరించారు. అనంతరం దాడికి యత్నించిన టీడీపీ నాయకులపై వైఎస్సార్‌సీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. టీడీపీ నాయకులు సైతం వైఎస్సార్‌సీపీ నాయకులపై ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఇంత గొడవ జరిగినా హెచ్ఎం సుజాత టీడీపీ నాయకుల ఒత్తిళ్లతో ఎన్నికలను పూర్తిచేశారు. హెచ్ఎం సంయమనం పాటించి ఉంటే ఇంత గొడవలు జరిగేవి కావని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

కూటమి ఎత్తులు చిత్తు చేసి



ప్రమాణ స్వీకారం చేస్తున్న జయంపు స్కూల్ కమిటీ చైర్మన్

బాలాయపల్లి(సైదాపురం): బాలాయపల్లి మండలం జయంపు జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాల స్కూల్ కమిటీ చైర్మన్ల ఎన్నికల్లో కూటమి నేతల ఎత్తులను వైఎస్సార్‌సీపీ నేతలు చిత్తు చేశారు. ఎస్ఎంసీ చైర్మన్ల ఎంపిక కోసం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, మాజీ సహకారం సంఘం అధ్యక్షుడు వెందోటి కార్తీక్‌రెడ్డి అందరినీ సమన్వయం చేసుకుని కూటమి నేతల కుట్రలను తిప్పి కొట్టారు. ఈ ఎన్నికల కోసం ఎస్ఐతో పాటు ఏఎస్ఐ, నలుగురు సిబ్బంది వచ్చారు. ఎన్నికల ప్రక్రియ సాగినంత సేపు అటు పోలీసులను, ఇటు ఉపాధ్యాయులను కూటమి నేతలు బెదిరించారు. అయితే పోలీసులు, ఉపాధ్యాయులు మాత్రం కోరం ఎవరి వైపు మొగ్గు చూపితే వారికే పట్టకట్టడం జరుగుతుందని చెప్పారు.

తిరుమలపాడులో ఏకపక్షంగా ఎన్నిక



కలువాయి ఎమ్మార్సీ వద్ద ఆందోళన చేస్తున్న తిరుమలపాడు గ్రామస్తులు

కలువాయి: మండలంలోని తిరుమలపాడు కొత్తూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం ఎస్ఎంసీ ఎన్నికల్లో ఓటింగ్ పూర్తి చేయకుండానే ఒక వర్గం వారు గెలిచినట్లు హెచ్ఎం లక్ష్మీకుమారి ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడంపై గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మార్సీ వద్ద ఆందోళనకు దిగారు. వారు మాట్లాడుతూ స్కూల్ కమిటీ చైర్మన్ ఎంపికలో హెచ్ఎం తమ ప్రత్యర్థి వర్గం వారితో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. ఇదేంటని అడిగితే గిరిజనులమైన తమను కులం పేరుతో దూషించారని, తక్షణం ఆమెపై చర్యలు తీసుకోవాలని ఎంఈఓకు ఫిర్యాదు చేశారు.

పున్నేపల్లిలో హైడ్రామా..



ఎంఈఓతో మురళీ మద్దతుదారుల వాగ్వాదం

ఓజిలి: మండలంలోని పున్నేపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యాకమిటీ ఎన్నికల్లో హైడ్రామా నడిచింది. పున్నేపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యాకమిటీ చైర్మన్ ఎన్నిక కోసం హెచ్ఎం కల్యాణి విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలకు పిలిచి అందరి ఆమోదంతో ముందుగా 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు, తరగతికి ముగ్గురు చొప్పున 24 మంది తల్లిదండ్రులను ఎంపిక చేశారు. వారిలో ముగ్గురు గైర్హాజరు కాగా, 20 మందితో ఎన్నిక నిర్వహించారు. వీరిలో కోటపూరి మురళికి 11 మంది తల్లిదండ్రులు చేతులు పైకెత్తి ఆమోదం తెలిపారు. అనంతరం వైస్ చైర్మన్‌గా మాకాని రేణుక ఏకగ్రీవంగా ఆమోదం తెలపడంతో ఎన్నిక పూర్తి చేశారు. వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు మురళి గెలుపొందాడని సమాచారం తెలుసుకున్న టీడీపీ నాయకులు హెచ్ఎంపై ఒత్తిడి తీసుకొచ్చారు. మళ్లీ రహస్య ఓటింగ్ నిర్వహించగా మరోమారు మురళీకి 11 మంది ఆమోదం తెలిపారు. మళ్లీ దీనిపై టీడీపీ నాయకులు రచ్చ చేశారు. మురళీ మద్దతుదారులు తల్లిదండ్రులపై ఒత్తిడి చేసి, వారికి అనుకూలంగా స్లిప్పులు ఇచ్చారంటూ ఎంఈఓతో వాగ్వాదానికి దిగారు. మరోవైపు ఉదయం 11 గంటలకు ఎన్నిక పూర్తయినా, ఇంతవరకు ఎందుకు ప్రకటించట్లేదని మురళీ మద్దతుదారులు పట్టుపట్టారు. చివరకు మురళీని ఎస్ఎంసీ చైర్మన్‌గా హెచ్ఎం కల్యాణి, ఎంఈఓ శైలజ ప్రకటించారు.

విద్యుత్ అంతరాయాలను తగ్గించండి

- నిరంతర విద్యుత్ సరఫరానే లక్ష్యం
- విద్యుత్ ప్రమాదాల నివారణపై విస్తృత అవగాహన
- ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు



మాట్లాడుతున్న ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు

తిరుపతి రూరల్: విద్యుత్ శాఖలో ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్యూర్స్‌ను తగ్గించేందుకు అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు ఆదేశించారు. తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో గురువారం సంస్థ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు అధికారులు, సిబ్బంది మెరుగైన సేవలను అందించాలన్నారు. విద్యుత్ అంతరాయాలపై సర్కిల్, డివిజన్, సబ్-డివిజన్, సెక్షన్ స్థాయిల్లో సంబంధిత అధికారులు నిరంతరం సమీక్షిస్తూ, వాటిని పూర్తిస్థాయిలో నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వినియోగదారులకు సేవలందించడంలో అలసత్వాన్ని దరి చేరనీయవద్దని హెచ్చరించారు. సంస్థ పరిధిలో విద్యుత్ ప్రమాదాల నివారణకు వినియోగదారుల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. సోలార్ విద్యుత్ వినియోగంపై వినియోగదారులను చైతన్యవంతం చేయాలని కోరారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్స్ ఎక్కువగా ఉంటే సంబంధిత అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్పీడీసీఎల్ మొబైల్ యాప్‌ను సరళతరంగా ఉండే విధంగా అభివృద్ధి చేశామని, ఈ అంశంపై వినియోగదారుల్లో అవగాహన పెంపొందించాలన్నారు. వినియోగదారులు మొబైల్ యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని, సకాలంలో విద్యుత్ బిల్లులను చెల్లించవచ్చని వివరించారు.

టోల్‌ఫ్రీ నంబర్లకు ఫిర్యాదు చేయండి

వినియోగదారులు విద్యుత్ అంతరాయం, సమస్యలపై టోల్ ఫ్రీ నంబరు: 1912 లేదా 1800 425 155333కు కాల్ చేయడం, చాట్ బోట్, 91333 31912 నంబరుతో వాట్సాప్ చాట్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని సీఎండీ సంతోషరావు తెలిపారు.

నిర్లక్ష్యం చేస్తే సహించం

- వైద్యసేవలపై ఫిర్యాదులు వస్తున్నాయి
- కలెక్టర్ వెంకటేశ్వర్ హెచ్చరిక



తిరుపతి అర్బన్: ఎన్టీఆర్ వైద్యసేవ పథకం ద్వారా పేదలకు అందిస్తున్న వైద్య సేవలకు సంబంధించి ఫిర్యాదులు వస్తున్నాయని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ హెచ్చరించారు. గురువారం ఆయన వైద్యసేవలపై ఆ విభాగానికి చెందిన అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 28 ఆస్పత్రులపై 181 ఫిర్యాదులు అందాయని వెల్లడించారు. అంతా తమకు సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తే కుదరదని స్పష్టం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫిర్యాదులపై విచారణ చేపట్టాలని ఆదేశించారు. వాస్తవాలు వెలువడిన తర్వాత బాధ్యతగా పనిచేయని వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవలో భాగంగా సేవలు అందిస్తున్న ఎన్టీఆర్ వైద్యమిత్రలు, టీం లీడర్, డిస్ట్రిక్ట్ మేనేజర్, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆస్పత్రులకు వెళ్లి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. మళ్లీ మూడు నెలల తర్వాత సమావేశం నిర్వహిస్తామని, ఒక్క ఫిర్యాదు అందినా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ శ్రీహరి, రాజశేఖర్ రెడ్డి, కె.శివ కుమార్, టీం లీడర్లు, స్విమ్స్, రుయా ఆస్పత్రి, మెటర్నిటీ హాస్పిటల్, రష్ హాస్పిటల్, అమర హాస్పిటల్, నారాయణాద్రి హాస్పిటల్, రమాదేవి హాస్పిటల్, డీబీఆర్ ఆస్పత్రి, సీఆర్ రెడ్డి హాస్పిటల్, సంకల్ప హాస్పిటల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

11న జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

నగరి : జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 11వ తేదీ ఆదివారం శ్రీకాళహస్తి మహిళా డిగ్రీ కళాశాల గ్రౌండ్ ఆవరణలో నిర్వహించనున్నట్లు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి బాలాజి తెలిపారు. ఉమ్మడి జిల్లా సబ్‌జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ ఎంపిక పోటీలు ఉంటాయన్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ పవన్‌కుమార్

వాకాడు: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం మండల కేంద్రం వాకాడులో ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికుల వివరాల మేరకు.. స్థానిక గొల్లపాళెం గ్రామానికి చెందిన వళ్లూరు కోటయ్య వాకాడులో సరసమ్మ అనే మహిళతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధ పడుతున్న కోటయ్య ఐదు రోజుల కింట ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సరసమ్మ అతని కోసం వెతికినా కనిపించలేదు. చివరికి వాకాడు ఎస్‌ఏఎల్సీ గ్రౌండ్ సమీపంలోని వరి పొలాల్లో కుళ్లిన స్థితిలో శవమై కనిపించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.

నకిలీ డాక్టర్ అరెస్ట్

తిరుపతి క్రైమ్: రుయా ఆస్పత్రిలో నకిలీ డాక్టర్‌గా చలామణి అవుతూ అవుట్ పేషెంట్లను మోసం చేస్తున్న ఓ వ్యక్తిని వెస్ట్ పోలీసులు గురువారం అరెస్ట్ చేసినట్లు సీఐ జయనాయక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. సత్యసాయి జిల్లా నర్సంపల్లి తాండా, బుక్కపట్నం మండలానికి చెందిన బనావత్ సాయికుమార్ నాయక్(25) రుయా ఆస్పత్రిలో స్టెతస్కోప్ వేసుకుని డాక్టర్ల బిల్డప్ ఇచ్చేవాడు. ఆస్పత్రికి వచ్చిన పేషెంట్లు, అటెండర్లు, నిస్సహాయులను ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడేవాడు. వారి వద్ద నుంచి మాయమాటలు చెప్పి మొబైల్ ఫోన్లను లాక్కొని వెళ్లిపోయేవాడు. అదేకాకుండా వారి బ్యాంకు ఖాతా నుంచి నగదును సైతం విత్‌డ్రా చేసేవాడు. పెద్దఎత్తున ఇతర ఫిర్యాదులు రావడంతో అలిపిరి సమీపంలోని గరుడ సర్కిల్ వద్ద అరెస్ట్ చేస్తామన్నారు.

శ్రీసిటీ.. ఇదో బహుళజాతి పారిశ్రామిక వాడ.. ఇక్కడ కాలుష్యం కంటికి కనిపించదు.. పచ్చదనంతో కూడిన చల్లదనం.. మధ్యలో చెట్ల వరుసలతో కూడిన విస్తారమైన రోడ్లు.. పెద్ద కూడళ్లు.. ఉద్యానవనాలు.. సమృద్ధిగా ఉన్న నీటి వనరులు.. ప్రశాంత వాతావరణంలో నివాస సముదాయాలు.. వెరసి సత్యవేడు నియోజకవర్గంలోని వరదయ్యపాళెం, సత్యవేడు మండలాల పరిధిలో వెలిసిన శ్రీసిటీ పారిశ్రామిక రంగానికే నేడు ప్రపంచస్థాయిలో మోడల్‌గా నిలిచి కీర్తిప్రతిష్టలు పొందింది. శ్రీసిటీ ప్రస్థానం నేటికి పదహారేళ్లు. ఈ అనతికాలంలోనే పారిశ్రామిక వాడలో ఎన్నో బహుళజాతి కంపెనీలు కొలువుదీరగా, ఎంతోమందికి ఉపాధి కల్పనకు కల్పతరువుగా నిలిచింది.

శ్రీసిటీలోని ఆల్‌స్టోమ్ పరిశ్రమలో ఉత్పత్తవుతున్న రైళ్లు


శ్రీసిటీలోని ఇసుజు పరిశ్రమలో ఉత్పత్తవుతున్న కార్లు


పారిశ్రామిక దిక్సూచి శ్రీసిటీ

- నేటికి పదహారేళ్ల ప్రస్థానంలోకి శ్రీసిటీ
- బహుళజాతి పారిశ్రామిక వాడగా గుర్తింపు
- అనతికాలంలోనే ప్రపంచస్థాయి మౌలిక వసతుల కల్పన సముదాయంగా గుర్తింపు
- దేశంలోని పది గొప్ప ఉత్పాదక ప్రదేశాల్లో ఒకటిగా గుర్తింపు
- 4.5 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ విలువైన ఎగుమతులతో దినదినాభివృద్ధి
- నాటి మహానేత వైఎస్సార్ ఆలోచన.. నేడు రాష్ట్ర ప్రగతికి సాక్ష్యం

శ్రీసిటీ (వరదయ్యపాళెం): ఆంధ్ర- తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన సత్యవేడు నియోజకవర్గం అభివృద్ధి పరంగా 2004కు ముందు ఎంతో వెనుకబడిన ప్రాంతం. దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అత్యంత వెనుకబడిన సత్యవేడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలన్న మహాసంకల్పంతో నియోజకవర్గ పరిధిలోని వరదయ్యపాళెం, సత్యవేడు మండలాల్లో 8 వేల ఎకరాలలో శ్రీసిటీ పారిశ్రామికవాడ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. సరిగ్గా 2008 ఆగస్టు 8వ తేదీ మహానేత వైఎస్సార్ చేతుల మీదుగా పారిశ్రామిక ప్రగతికే దిగ్గజమైన శ్రీసిటీతో పాటు అదే రోజున 8 పరిశ్రమల ఏర్పాటుకు భూమిపూజ చేశారు. నాటి మహానేత సంకల్పంతో పదహారేళ్ల ప్రస్థానాన్ని దిగ్విజయంగా పూర్తి చేసుకున్న శ్రీసిటీ ఏకీకృత వ్యాపార నగరంగా విస్తరించింది. అనతికాలంలోనే ప్రపంచస్థాయి పారిశ్రామిక మౌలిక వసతుల సముదాయంగా నిలిచింది.

బహుళ ఉత్పత్తుల తయారీ నగరంగా శ్రీసిటీ..

బహుళ ఉత్పత్తుల వ్యాపార నగరానికి సరైనదిగా శ్రీసిటీ అభివృద్ధి చెందుతోంది. ప్రపంచ దేశాల కోసం వివిధ రంగాల్లో అత్యుత్తమ నాణ్యత కలిగిన ప్రపంచ ప్రఖ్యాత బ్రాండ్ల ఉత్పత్తులు ఇక్కడ తయారవుతున్నాయి. ఆ దిశగా కార్ల తయారీ పరిశ్రమ ఇసుజు, ఎక్స్‌కవేటర్లు, క్రేన్లు తయారీలో కొబెల్కో, మెట్రో రైళ్లు (ఆల్‌స్టోమ్), ఆటో మొబైల్ విడిభాగాలు (ఎన్‌ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్), నిర్మాణ పరికరాలు, ఇంజినీరింగ్ ఉత్పత్తులు (ఆస్ట్రోటెక్ స్టీల్స్, డానియలీ, వీఆర్‌వీ చార్ట్, బెర్జన్ పైప్ సపోర్ట్స్, రొటలాక్) మొదలైనవి, ఎలక్ట్రానిక్, ఎలక్ట్రిక్ ఉత్పతుత్తుల్ల (జెడ్‌టీటీ, పానాసోనిక్, సన్‌సోలార్) ఎయిర్ కండిషనర్లు (డైకిన్, బ్లూస్టార్, యాంబర్, హావెల్స్‌–లాయిడ్, ఈప్యాక్ డ్యురబుల్, థర్మాక్స్), చక్రాల కుర్చీలు, ఆస్పత్రి మంచాలు వంటి పునరావాస సంరక్షణ పరికరాలు తయారీ చేసే వెర్మీరియన్, చాక్లెట్లు (మాండలీజ్, క్యాడ్‌బరీ), సాఫ్ట్ డ్రింక్స్ (పెప్సికో) మరెన్నో పరిశ్రమలు ఉన్నాయి. 2027 నాటికి భారతదేశంలో ఉత్పత్తయ్యే మొత్తం ఎయిర్ కండిషనర్లలో 50 శాతానికి పైగా శ్రీసిటీలోనే తయారయ్యే పరిస్థితులు ఉన్నాయి. అలాగే ప్యాకేజింగ్, లాజిస్టిక్ సేవలకు కేంద్రంగా శ్రీసిటీ అభివృద్ధి చెందుతోంది.

4 బిలియన్ డాలర్ల పెట్టుబడులు..

గత పదహారేళ్ల ప్రగతి ప్రస్థానంలో 4 బిలియన్ల అమెరికన్ డాలర్లు పెట్టుబడులు వచ్చాయి. 4.5 బిలియన్ అమెరికన్ డాలర్ల కంటే ఎక్కువ విలువైన ఎగుమతులతో శ్రీసిటీ దినదినాభివృద్ధి చెందుతోంది. వివిధ తయారీ రంగాల్లో 35 దేశాలకు చెందిన 45 బహుళజాతి కంపెనీలతో సహా మొత్తం 230కి పైగా ప్రఖ్యాతి గాంచిన పరిశ్రమలు శ్రీసిటీ నిలయంగా మారింది. భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉద్యమంలా సాగుతున్న మేక్ ఇన్ ఇండియా చొరవకు శ్రీసిటీ ఒక ప్రేరణ చిహ్నంగా మారింది.

సామాజిక సేవలో శ్రీసిటీ..

పారిశ్రామిక వృద్ధితో పాటు పరిసర ప్రాంతం సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కూడా శ్రీసిటీ పెద్దపీట వేస్తోంది. శ్రీసిటీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా మెరుగైన ఆరోగ్య సేవలు, సామాజిక మౌలిక సదుపాయాలు, జీవనోపాధి వంటి కీలక సామాజిక అంశాలపై ప్రత్యేక దృష్టి పెడుతోంది.

8వేల ఎకరాలలో శ్రీసిటీ విస్తరణ..

8 వేల ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన శ్రీసిటీ ప్రత్యేక ఆర్థిక మండలి (ఎస్‌ఈజెడ్), డొమెస్టిక్ టారీఫ్ జోన్ (డీటీజెడ్), ఫ్రీ ట్రేడింగ్ వేర్‌హౌసింగ్ జోన్ (ఎఫ్‌టీడబ్ల్యూ), ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్ (ఈఎంసీ)లు ఉన్నాయి. శ్రీసిటీ ప్రాంతాన్ని దేశంలోని పది గొప్ప ఉత్పాదక ప్రదేశాలలో ఒకటిగా ఇన్‌వెస్ట్ ఇండియా పేర్కొంది. ఇండస్ట్రియల్ పార్క్ రేటింగ్ సిస్టమ్ 2.0 ప్రాతిపదికగా డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) దేశంలోని వివిధ ఇండస్ట్రియల్ పార్కులు, సెజ్‌లలో శ్రీసిటీని లీడర్స్‌గా పరిగణిస్తోంది. దక్షిణ భారతదేశంలో ఈ గుర్తింపును సాధించిన ఏకైక పారిశ్రామిక పార్కు శ్రీసిటీ కావడం గమనార్హం.


శ్రీసిటీలో ఏర్పాటైన ఎక్స్‌ప్రెస్ హైవే

500 మంది రక్తదానం


శ్రీసిటీలో నిర్వహించిన రక్తదాన శిబిరం


శ్రీసిటీ (వరదయ్యపాళెం): శ్రీసిటీ 16వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సెంట్రల్ జీఎస్టీ కమిషనరేట్, శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీసిటీలోని మూడు వేర్వేరు ప్రదేశాలలో రక్తదాన శిబిరాలను గురువారం నిర్వహించారు. యాక్సలెంట్ ఫార్మా, బ్రేక్స్ ఇండియా, ఇసుజు, నిట్టాన్ ఇండియా, రాక్‌వర్త్, వెర్మీరియన్, టిల్, ఈప్యాక్ సహా 40 పరిశ్రమలకు చెందిన ఉద్యోగులు, సూళ్లూరుపేట గోకులకృష్ణ ఇంజినీరింగ్, సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సుమారు 500 మందికి పైగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ ప్రాణాలను రక్షించే రక్తదానంలో భాగస్వాములైన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నెల్లూరు జీఎస్టీ కమిషనరేట్ సూపరింటెండెంట్ సునీల్ గౌతమ్, శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్ కుమార్, సీఎస్‌ఆర్ మేనేజర్ నిరీషా సన్నారెడ్డి, హెచ్‌ఆర్ ప్రతినిధి శివకుమార్‌రెడ్డి, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు పోలీసుశాఖ ఎస్‌బీలో బదిలీలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు పోలీసుశాఖలోని స్పెషల్ బ్రాంచ్(ఎస్‌బీ) విభాగంలో పనిచేస్తున్న పలువురు సిబ్బందిని బదిలీ చేస్తూ ఎస్పీ మణికంఠ చందోలు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు ఎస్పీలో పనిచేస్తున్న ఎ.రామకృష్ణను పాలసముద్రంకు, పి.అరుణాచలంను గంగవరానికి, తిరుమలలో ఉన్న కె.వి నాయకంను చిత్తూరు ఎస్‌బీకి, చిత్తూరు వన్‌టౌన్‌లో ఉన్న రామచంద్రాచారి, చౌడేపల్లెలో ఉన్న గోవిందస్వామి, పలమనేరులో ఉన్న టి.శ్రీనివాసులు, తవణంపల్లెలో ఉన్న బాలాజీని చిత్తూరు ఎస్‌బీకి బదిలీ చేస్తూ ఆదేశాలు ఇచ్చారు.

బయో డీజిల్ అక్రమ విక్రయాలపై సమాచారం లేదా..?

- తిరుపతి ఎంపీ గురుమూర్తి


ఢిల్లీ పార్లమెంట్‌లో మాట్లాడుతున్న తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి

తిరుపతి మంగళం : పెట్రోలియం, పేలుడు పదార్థాల భద్రతా సంస్థ నిబంధనలు పాటించకుండా అనధికార బయో డీజిల్ విక్రయాలు జరుగుతున్నాయని ఆ విషయాలు కేంద్ర ప్రభుత్వానికి తెలియదా? అని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి గురువారం ఢిల్లీ పార్లమెంట్‌లో ప్రశ్నించారు. రవాణా ప్రయోజనాల కోసం హై-స్పీడ్ డీజిల్‌తో కలపడం కోసం బయో-డీజిల్ అమ్మకానికి సంబంధించిన మార్గదర్శకాలు-2019' బయో డీజిల్ అమ్మకాలను విస్తృతంగా కవర్ చేయలేదనేది నిజమేనా, అలా అయితే అందుకు సంబంధించిన పరిస్థితిని మెరుగుపరిచేందుకు తీసుకొంటున్న చర్యలను తెలపాలని కోరారు. కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖా సహాయ మంత్రి సురేష్ గోపి సమాధానం ఇస్తూ దేశంలో బయోడీజిల్ పేరుతో అనధికారికంగా బయో డీజిల్‌ను విక్రయించడం, పెట్రోలియం ఉత్పత్తులను అక్రమంగా విక్రయిస్తున్నట్లు ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు ఫిర్యాదులు అందుతున్నాయని వివరించారు. ప్రభుత్వం ఇప్పటికే రవాణా ప్రయోజనాల కోసం హై-స్పీడ్ డీజిల్‌తో కలపడం కోసం బయో డీజిల్ అమ్మకానికి మార్గదర్శకాలు-2019 జారీ చేసిందని తెలియజేశారు.

స్థల పరిశీలన

- 20 ఎకరాల స్థలాల కేటాయింపు

తిరుపతి అర్బన్: తిరుపతి జూపార్క్ సమీపంలోని పర్యాటక కార్పొరేషన్ కార్యాలయం చెంత ఒబెరాయ్ సెవెన్ స్టార్ హోటల్స్ నిర్మాణం చేపట్టనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం ఆయన ఒబెరాయ్ హోటల్స్‌కు కేటాయించిన 20 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. లీజు ఒప్పందం ప్రకారం నిబంధనలు పాటించాల్సి ఉంటుందని చెప్పారు. తిరుమలతో పాటు శ్రీకాళహస్తి, తిరుచానూరు, తూపిలిపాలెం బీచ్, ఇరకం దీవులు, తలకోన తదితర పర్యాటక ప్రాంతాలకు ప్రతి రోజు 75 వేల నుంచి లక్ష మంది వరకు యాత్రికులు వచ్చిపోతున్నట్లు లెక్కలు ఉన్నాయని వెల్లడించారు. వారి సౌకర్యం కోసం విలాసవంతమైన, మెరుగైన సౌకర్యాలతో ఒబెరాయ్ హోటల్స్ నెలకొంటున్నాయని తెలిపారు. ఆయనతోపాటు తిరుపతి ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి, జూపార్క్ క్యూరేటర్ సెల్వం, జిల్లా పర్యాటకశాఖ అధికారి రూపేంద్రనాథ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


ఒబెరాయ్ హోటళ్లకు కేటాయించిన 20 ఎకరాల స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తేనెటీగల దాడిలో యువకుడి మృతి

కోట : మండలంలోని గూడలిలో గురువారం తేనెటీగల దాడిలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. గ్రామస్తుల కథనం మేరకు.. గూడలికి చెందిన పూండ్ల అశోక్(34) ఇంటి వద్ద పని చేస్తుండగా తేనేటీగలు దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన అతన్ని కుటుంబ సభ్యులు కోటలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో నెల్లూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కోటలో వైద్యం అందించిన డాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే అశోక్ మృతి చెందాడంటూ కుటుంబ సభ్యులు ఆస్పత్రి వద్ద వాగ్వాదానికి దిగారు. ఈ విషయమై పోలీసులకు ఎటువంటి సమాచారం అందలేదు.


మృతి చెందిన అశోక్ (ఫైల్)

నైపుణ్యాలను పెంచుకోండి

నారాయణవనం: వృత్తి విద్యాకోర్సులను అభ్యసిస్తున్న యువ ఇంజినీర్లు తమలో నైపుణ్యతను, పరిశోధనాత్మక దృక్పథాన్ని పెంచుకోవాలని పుత్తూరు గ్రూప్ ఆఫ్ సిద్ధార్థ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ డాక్టర్ అశోకరాజు తెలిపారు. గురువారం కళాశాల ఆడిటోరియంలో మొదటి సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఒక్క రోజు ఓరియెంటేషన్ శిబిరం నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న అశోక్‌రాజు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ సుబ్బరాజు, ప్రిన్సిపల్స్ చంద్రశేఖర్‌రెడ్డి, జనార్ధనరాజు, రమేష్ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు పలు సూచనలు చేశారు. చివరగా కళాశాల ప్రగతిని ఏవీని ప్రదర్శించారు. ఈ కార్యక్రమాల్లో వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అశోక్‌రాజు

నా భార్య బతికే ఉందయ్యా..!

- సచివాలయ రికార్డుల్లో చనిపోయినట్టు నమోదు
- వెంటనే సవరించండి.. భార్యతో కలిసి భర్త నిరసన

సత్యవేడు: 'నా భార్య బతికే ఉన్నా.. సచివాలయం రికార్డుల్లో చనిపోయినట్టు ఉంది.. సవరించండి' అంటూ సత్యవేడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధితులు నిరసన తెలిపారు. సత్యవేడు మండలంలో రేపల్లెవాడ పంచాయతీ నారాయణపురం గ్రామానికి చెందిన టి.మాతయ్య, భార్య టి.సుభద్రకు ఆధార్ కార్డు, ఓటరు కార్డులున్నాయి. తన భార్య పేరున రేషన్ కార్డు కోసం మాతయ్య దరఖాస్తు చేసుకుంటే.. రేపల్లెవాడ సచివాలయంలోని కంప్యూటర్‌లో తన భార్య చనిపోయినట్టు నమోదై ఉందని అక్కడి సిబ్బంది చెప్పారని టి.మాతయ్య, ఆయన భార్య సుభద్రలు ఆందోళన వ్యక్తం చేశారు. సత్యవేడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ విషయమై సంబంధిత వీఆర్వోను వివరణ కోరగా కొత్త రేషన్ కార్డులు నమోదు కావడం లేదని, కొత్త కార్డులిచ్చే సమయంలో మార్పు చేసేందుకు వీలుంటుందని తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

నాయుడుపేటటౌన్: నాయుడుపేట పట్టణంలో 8 ఏళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడు షేక్ నౌషద్‌ను అరెస్టు చేసి గురువారం కోర్టుకు హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. పట్టణంలోని చిన్నదర్గా వీధిలో చేపల ఆక్వేరియం నిర్వహించే నౌషద్ చేపలను చూసేందుకు వచ్చే 8 ఏళ్ల చిన్నారిని లోబర్చుకున్నాడు. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పరారీలో ఉన్న నిందితుడు నౌషద్‌ను బుధవారం రాత్రి సీఎస్ తేజ సెంటర్ వద్ద అరెస్టు చేసినట్లు చెప్పారు.

ఆకట్టుకున్న యువకుల విన్యాసాలు

నారాయణవనం: మండల కేంద్రమైన నారాయణవనంలోని ధర్మరాజుల ఆలయంలో మహాభారత ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం యువకులు కొక్కీలను గుచ్చుకుని వేలాడుతూ మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్రేన్ల సాయంతో గాలిలో సుమారు 30 అడుగుల ఎత్తులో విన్యాసాలు చేస్తూ అందరినీ ఆకట్టుకున్నారు. గురువారం వన్నెకులస్తుల సంఘం ఆధ్వర్యంలో ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పదుల సంఖ్యలో వన్నెకుల యువకులు శరీరాలకు ఇనుప కొక్కీలను గుచ్చుకుని తాళ్ల సాయంతో భారీ క్రేన్లపై వేలాడుతూ పుర వీధుల్లో విహరించారు. చివరిగా ద్రౌపదీదేవి అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించిన పుష్పపల్లకిపై అధిష్టింపజేయగా, మహిళలు కర్పూర హారతులు ఇచ్చారు.


కొక్కీలను గుచ్చుకుని వేలాడుతూ వస్తున్న యువకులు